
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 2 । జనవరి । 2025



సోమశిలలో 71.88 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 71.887 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 2820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,590
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,132
3 శాతం జీఎస్టీతో	రూ.7,346
నవర (8 గ్రా)	రూ.58,768

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం గురువారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 73 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఎన్‌ఎంసీలో సూపరింటెండెంట్ల బదిలీ

నెల్లూరు(బారకాసు): పరిపాలన సౌలభ్యం కోసం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని పలు విభాగాల్లో సూపరింటెండెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న పలువురి అధికారులను బదిలీ చేస్తూ కమిషనర్ సూర్యతేజ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఎన్‌ఎంసీలోని హౌసింగ్ ఫర్ ఆల్ సెక్షన్ల సూపరింటెండెంట్ సిద్ధిక్‌ను మేయర్ పేషీ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పనిచేస్తున్న జి.బాలసుబ్రహ్మణ్యంను తాత్కాలికంగా హౌసింగ్ ఫర్ ఆల్ సెక్షన్ల ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించారు. లీగల్ సెల్ విభాగ సూపరింటెండెంట్ ఎ.ప్రవీణ్‌ను తాత్కాలికంగా ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నాయని కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్ల ఎంపికకు దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (బారకాసు): జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీల్లో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీసర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ తదితర వాటిని రిపేరు చేస్తూ సేవలందించే వారితో పాటు బ్యూటీషియన్, బార్బర్ వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు నగరపాలక కమిషనర్ సూర్యతేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారికి ఎన్‌ఏసీడీసీ, ఎస్‌డీసీ, ఎన్ఏసీల ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా వీరికి ఆన్‌బోర్డు ద్వారా జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఆయా సేవలు అందించే ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 4వ తేదీన శనివారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో జరిగే రిజిస్ట్రేషన్ మేళాకు హాజరై అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కమిషనర్ కోరారు. అర్హత ఉన్న అభ్యర్థులందరూ తమ రేషన్, ఆధార్, పాన్ కార్డులతో పాటు బ్యాంకు పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్ జెరాక్స్, రెండు ఫొటోలు తీసుకుని హాజరు కావాలని తెలియజేశారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా రేపు



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో ఈ నెల 3న ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 18- 35 ఏళ్లలోపు, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఇతర వివరాలకు 9573482179 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.


పరీక్ష ఫీజును ఆరులోపు చెల్లించాలి

నెల్లూరు (టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫీజును ఈ నెల ఆరులోపు చెల్లించాలని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.25 అపరాధ రుసుముతో 8 వరకు, రూ.50 అపరాధ రుసుముతో తొమ్మిది వరకు, తత్కాల్ రుసుముతో పది వరకు గడువుందని చెప్పారు. వివరాలకు ఏపీఓఎస్సెస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

డీఆర్పీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (పొగతోట): జిల్లా గ్రామీణాభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థల పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా జిల్లాలో రిసోర్స్ పర్సన్ల (డీఆర్పీ) ఎంపిక కోసం ఈ నెల ఐదులోపు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి మండలంలో డీఆర్పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నామని వివరించారు. ఎంపికైన డీఆర్పీలు ఆయా మండలాల్లో పారిశ్రామికవేత్తలను గుర్తించడం, పథకాలను వివరించడం, ప్రాజెక్ట్ రిపోర్టులను సిద్ధం చేయడం, బ్యాంకులతో సమన్వయపర్చి రుణాలు మంజూరయ్యేలా సహకరించడం తదితరాల్లో పాల్గొననున్నారని వివరించారు. వివరాలకు 0861 – 2321261, 89851 20012 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సింహపురికి జ్వరమొచ్చింది



బుజబుజనెల్లూరుకు చెందిన మంగమ్మకు జ్వరం రావడంతో పెద్దాస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. నాలుగు రోజులు ఆస్పత్రిలోనే ఉంచి ఆ తర్వాత డిశ్చార్జి చేశారు. వారం పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రి కావడంతో వైద్య ఖర్చులు తప్పాయి. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే ఆమెకు 10 రోజులు పని కరువైంది. ఆటో, ఇతర, సహాయకురాలి ఖర్చులు కలిపి సుమారు రూ.వెయ్యి అయింది. కూలీ పనులు పోవడంతో రూ.ఏడు వేలు నష్టపోయారు. ఇదే తరహాలో నిత్యం వేలాది మంది జ్వరాలతో బాధపడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు.



నెల్లూరులోని బీవీనగర్‌కు చెందిన 47 ఏళ్ల వెంకటకృష్ణారెడ్డికి గత బుధవారం తీవ్ర జ్వరమొచ్చింది. ఆ ప్రాంతంలోని డాక్టర్ వద్దకెళ్లగా జ్వరం మాత్రలు, యాంటీబయోటిక్స్‌ను రాసిచ్చారు. మూడు రోజులైనా తగ్గకపోవడంతో సమీపంలోని మరో మహిళా డాక్టర్ వద్దకు ఆదివారం వెళ్లారు. రక్త పరీక్షలు చేయగా, ఏ జ్వరమో నిర్ధారణ కాకపోవడంతో వైరల్ ఫీవర్ అని తేల్చారు. అడ్మిట్ చేసుకొని హయ్యర్ యాంటీబయోటిక్ ఇంజెక్షన్లను వేశారు. మరో మూడు రోజుల్లోనే రూ.17 వేల బిల్లు వేశారు. అదే కార్పొరేట్ ఆస్పత్రిలో మూడింతల బిల్లయ్యేది.

పట్టించుకోని వైద్యశాఖ

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ తదితరులు ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, ఇతర జబ్బులు ఏమైనా ఉన్నాయాననే అంశంపై సర్వే చేసేవారు. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియ అటకెక్కింది. అప్పట్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇళ్ల వద్దే వృద్ధులు, మంచాన ఉన్న వారు, పురిటి పిల్లలు, మహిళలకు వైద్యసేవలందించే వారు. ఈ విధానంతో పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు ఇంటి వద్దే లభించేవి. ఇప్పుడా విధానాన్నే మార్చేశారు. అసలు ప్రజల జ్వరాలపై వైద్యశాఖ పట్టించుకోవడాన్ని మానేసిందనే చెప్పాలి. సీహెచ్‌సీల్లో మందుల కొరత వేధిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మంచి వైద్యసేవలందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డెంగీ జ్వరాలతో నిన్నామొన్నటి వరకు బాధపడిన రోగులు తాజాగా వైరల్ ఫీవర్లతో విలవిల్లాడుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితులు, మంచుకాలం కావడంతో ఇవి జిల్లాను వణికిస్తున్నాయి. ఒక ప్రాంతంలో జ్వరాలు ప్రబలిన వెంటనే అక్కడ వైద్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులను గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నిర్వహించేవారు. ఇంటింటి ఫీవర్ సర్వేలు తరచూ జరిగేవి. ప్రజలకు తగు జాగ్రత్తలు చెప్పి వైద్యం అందించడంతో పాటు వారి ఇళ్లకెళ్లి మందులను అందజేసేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మెడికల్ క్యాంపులను నిర్వహించడం అటకెక్కింది. ఫీవర్ సర్వేలు జరగక, క్షేత్రస్థాయిలోకి వెళ్లడాన్ని విస్మరించి ప్రజారోగ్యాన్ని గాలి కొదిలేశారు.



పెద్దాస్పత్రిలో ఓపీ చీటీల కోసం క్యూలో రోగులు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

నెల్లూరు(అర్బన్): సింహపురికి జ్వరమొచ్చింది. వైరల్ ఫీవర్లు విజృంభిస్తుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. నగరంలోని జీజీహెచ్‌తో పాటు రామచంద్రారెడ్డి, జయభారత్, పలు కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ పరిస్థితి నెలకొంటోంది. జ్వరంతో వెళ్తే బ్లడ్ టెస్ట్‌లు, ఎక్స్‌రే, స్కానింగ్ అంటూ అవసరం లేని పరీక్షలు చేస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు డబ్బులు గుంజుతున్నాయి. ఆరోగ్యం ప్రధానం కావడంతో అప్పు చేసి మరీ వైద్యం పొందుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 58 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, కావలి, కందుకూరులో ఏరియా ఆస్పత్రులు, ఆత్మకూరులో జిల్లా ఆస్పత్రి, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, నెల్లూరులో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ సుమారు 13 వేల మంది వరకు రోగులొస్తున్నారు. వీరిలో 20 శాతం మంది.. అంటే 2600 మందికిపైగా జ్వరపీడితులే. వైద్యశాఖలో రిజిస్టరైన 450 ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో 25 వేల మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరిలోనూ దాదాపు ఐదు వేల మంది జ్వరపీడితులే కావడం గమనార్హం.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

స్క్రబ్‌టైఫస్ కేసులు నమోదు

జిల్లాలో డెంగీతో పాటు ప్రమాదకరమైన స్క్రబ్ టైఫస్ లాంటి జ్వరాలు అక్కడక్కడా నమోదవుతూనే ఉన్నాయి. డెంగీ కేసులు కాస్త తగ్గినా, నియంత్రణలోకి రాలేదు. అధికారుల లెక్కల మేరకు జిల్లాలో ఇప్పటి వరకు 129 డెంగీ, ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి. నిజానికి డెంగీ కేసులు వేలల్లో ఉన్నా, అధికారులు కాకి లెక్కలు చెప్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. వీటికి తోడు వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటంతో పూట గడవని నిరుపేద రోగులు ఇబ్బంది పడుతున్నారు.

నియంత్రణలోనే ఉన్నాయి

జిల్లాలో జ్వరాలు నియంత్రణలోనే ఉన్నాయి. సీజనల్ జ్వరాలు పెరిగితే వాటి నియంత్రణకు తగు చర్యలు చేపడతాం. జ్వరాల నియంత్రణకు మెడికల్ క్యాంపులను నిర్వహిస్తాం.

– సుజాత, డీఎంహెచ్‌ఓ

పన్నుపోటు.. వెన్నుపోటు

- గృహాలకు భారం.. వాణిజ్య భవనాలకు లాభం
- పన్నుల మోత పడకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీఓ 198 విడుదల
- దీన్ని తుంగలో తొక్కి జేబులు నింపుకొంటున్న రెవెన్యూ అధికారులు
- కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి
- రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఇలాకాలో పన్నులాట



ప్రజలకు క్షేత్రస్థాయిలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టడంలో కీలకమైన పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల ఆర్థిక పరిపుష్టికి ఆస్తి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. అటువంటి ఆస్తి పన్నుల వసూళ్లలో మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు అడ్డంగా అవినీతికి పాల్పడుతున్నారు. సాక్షాత్తు మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో సంబంధిత విభాగం అధికారులు పన్నులతో ప్రజలను ఆడుకుంటున్నారు. సర్వే పేరుతో గృహాలకు పన్నుల మోత మోగిస్తుండగా, వాణిజ్య భవనాలకు పన్నులు తగ్గించి జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థలో కీలకమైన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలు అవినీతికి అడ్డాగా మారాయి. భవనాల నిర్మాణం నుంచి పన్నుల విధింపు వరకు నిబంధనల అతిక్రమణ పేరుతో అడ్డుగోలుగా దోచుకుంటున్నారు. నగర పాలక సంస్థ ఆదాయానికి గండి కొడుతున్న పరిస్థితి నెలకొంది. తాజా రెవెన్యూ విభాగంలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు పరిధిలోని కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలకు అంతూపంతూ లేకుండా పోయింది.

పన్నుల భారం పడకుండా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తి పన్నుల విషయంలో ప్రజలకు భారం కాకూడదన్న ఆలోచనతో పన్నుల విధింపుపై 5 మున్సిపల్ చట్టాల్లో కొన్నింటిని సవరిస్తూ 2020 నవంబరు 24వ తేదీన జీఓ నంబరు 198 ద్వారా మార్గదర్శకాలను విడుదల చేశారు. 25 ఏళ్ల క్రితం ఏఆర్‌వీ (యాన్యువల్ రెంటల్ వాల్యూ) సిస్టం ద్వారా పన్నులు విధించేవారు. ఆ తర్వాత 2021 నుంచి ఏఆర్‌వీ నుంచి సీవీ (కాపిటల్ వాల్యూ) సిస్టంలోకి ఆస్తి పన్నును మార్చే ప్రక్రియకు విధివిధానాలు నిర్ణయించారు. ఈ జీఓ ప్రకారం ఆస్తి పన్నును ఒకేసారి పెంచకుండా ప్రజలకు వెసులు బాటు కల్పించారు. ఉదాహరణకు రూ.2 వేలు పన్ను రావాల్సి ఉంటే రూ.వెయ్యి వస్తుంటే మిగిలిన రూ.వెయ్యి పన్నును ఒకేసారి పెంచకుండా 10 నుంచి 15 శాతం లోపు పెంచుకుంటూ పోవాలి.

మంత్రి నారాయణ ఇలా చెప్పారు..

రూ.కోట్లలో పేరుకుపోయిన పన్నుల బకాయిలను వసూలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ ఇటీవల పలు సమావేశాల్లో కార్పొరేషన్ అధికారులను అనేక సార్లు ఆదేశించారు. కమర్షియల్ భవనాల నుంచి అధిక మొత్తంలో పన్ను విధించాల్సి ఉంటే.. తక్కువ పన్ను చెల్లిస్తున్న వాటిని గుర్తించి వాస్తవ పన్నును విధించాలి. ఎప్పుడో నిర్మాణం జరిగిన భవనాలకు సంబంధించి ఆస్తి పన్ను విధించనవి, నూతనంగా నిర్మించిన భవనాలకు పన్ను విధించనవి, అదనపు గదులు, అంతస్తులు నిర్మించిన భవనాలు, నివాసం నుంచి నివాసయేతర భవనాలుగా మార్చిన వాటిని, ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలని, ఈ మేరకు సర్వే చేయమని రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు.

నెల్లూరు నగరపాలక సంస్థ	
మొత్తం అసెస్‌మెంట్లు	1,33,551
ప్రైవేట్ భవనాలు	1,33,115
రాష్ట్ర ప్రభుత్వ భవనాలు	400
కేంద్ర ప్రభుత్వ భవనాలు	36
ఏటా ఆస్తి పన్ను రాబడి	– రూ.112.44 కోట్లు

రెవెన్యూ అధికారుల చేతివాటం

అసెస్‌మెంట్ నంబర్	వాస్తవ పన్ను	తగ్గించిన పన్ను
1031077009	రూ.60,040	రూ.17,193
1031017624	రూ.1,99,521	రూ.66,476
1031017584	రూ.84,853	రూ.34,785
1031017582	రూ.93,282	రూ.26,257

క్షేత్రస్థాయిలో ఇలా చేస్తున్నారు..

మంత్రి ఆదేశాలు ఒకలా ఉంటే క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు మరో రకంగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన 198 జీఓను చూపిస్తూ కార్పొరేషన్ అధికారులు తప్పుదోవ పట్టిస్తూ.. గృహ యజమానులపై భారం వేస్తూ.. వాణిజ్య భవన యజమానులకు మాత్రం లాభం చేకూర్చుతున్నారు. ఈ జీఓను అడ్డు పెట్టుకుని తమ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీఓ 198 ప్రకారం సీవీ సిస్టంలో ఉన్న పన్నును యథావిధిగా కొనసాగించాల్సి ఉండగా, మంత్రి ఆదేశాలంటూ నిర్దేశించిన భవనాలను కాకుండా అన్ని భవనాలను కొలతలు వేస్తూ వీటిలో గృహాలకు సంబంధించి కొలతలు వేసి, మీ ఇంటికి ప్రస్తుతం ఉన్న పన్ను పెరుగుతుందని చెబుతున్నారు. దీంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మరో వైపు వాణిజ్య భవనాలకు ఏఆర్‌వీ సిస్టంలో విధించి ఉన్న ఆస్తి పన్నును సీవీ సిస్టంలోకి మార్పు చేస్తూ పన్ను విలువను తగ్గించి విధిస్తూ వారి నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకుంటున్నారని సమాచారం.

ఆదాయాన్ని కొల్లగొడుతూ..

కమర్షియల్ భవనాలకు విధించి ఉన్న ఆస్తి పన్నును సీవీ సిస్టంలోకి మార్చి మూడొంతల మేర తగ్గించి వేస్తుండడంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీ గండి పడుతోందని సీహెచ్ అశోక్‌కుమార్ అనే వ్యక్తి ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 2 వేల వరకు ఉన్న కమర్షియల్ భవనాలకు ఇలా తగ్గించుకుంటూ పోతే రూ.కోట్లలో కార్పొరేషన్ ఆదాయానికి గండిపడనుందని తెలుస్తోంది. ఇదంతా మంత్రికి తెలిసే జరుగుతుందో లేక తెలియకుండా జరుగుతుందో అర్థం కావడం లేదు. ఆస్తి పన్ను వసూళ్లలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మంత్రి, కమిషనర్ ప్రత్యేక దృష్టి సారిస్తే గండి పడుతున్న కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచే అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

ప్రీమియర్ లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు స్పందన శూన్యం

- గడువు పొడిగింపు

నెల్లూరు(క్రైమ్): నగరంలో ప్రీమియర్ లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల ఏడో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పొడిగిస్తూ జిలా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు రీ నోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశారు. జిల్లాకు ఒక ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను ప్రభుత్వం కేటాయించింది. దరఖాస్తుల స్వీకరణకు తుది గడువుగా గత నెల 31ను నిర్ణయించారు. అయితే దరఖాస్తు వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గడువును పొడిగించారు. ఆసక్తి గల వారు apsbcl. ap. gov. in నుంచి దరఖాస్తులను డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. నాన్ రీఫండబుల్ రుసుము రూ.15 లక్షలకు డీడీని తీసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులతో దీన్ని జతపర్చి డీపీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు బీవీనగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఎడాపెడా తాగేశారు..!

- భారీగా మద్యం విక్రయాలు
- మూడు రోజుల్లో రూ.22 కోట్ల వ్యాపారం



నెల్లూరు(క్రైమ్): నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులైపారింది. రూ.22 కోట్ల మేర మద్యాన్ని తాగేశారు. నూతన ఏడాదిని పురస్కరించుకొని మంగళవారం అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడాయి. జిల్లాలో 182 వైన్ షాపులు, 50 బార్లు ఉన్నాయి. 165 మద్యం దుకాణాలకు నెల్లూరు దేవరపాళెంలోని ఐఎమ్మెల్ డిపో నుంచి.. మిగిలిన 17 దుకాణాలకు ఒంగోలు డిపో నుంచి మద్యం సరఫరా అవుతుంది. జిల్లాలో సగటున రోజుకు రూ.నాలుగు కోట్ల మద్యం విక్రయాలు సాగుతుంటాయి. నూతన సంవత్సర వేడుకల్లో ఎక్సైజ్ శాఖ ద్వారా భారీగా ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావించింది. దీనికి తగిన విధంగా మంగళ, బుధ వారాల్లో అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే గత నెల 30 నుంచే విక్రయాలు జోరందుకున్నాయి. సోమవారం రూ.12.4 కోట్లు.. మంగళవారం రూ.6.4 కోట్లు, బుధవారం రూ.3.2 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి.

పెంచలకోనకు పోటెత్తిన భక్తులు



రాపూరు: నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు భక్తులు బుధవారం పోటెత్తారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలంకార మండపంలో దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేసి ప్రసాదాలను అందజేశారు.



శ్రీవారి దర్శనార్థం క్యూలో భక్తులు

చెప్పిందొకటి.. చేస్తోందొకటి

కొత్త పింఛన్లు ఇస్తారని ఆశగా ఎదురు చూసిన లబ్ధిదారులకు నిరాశ తప్పలేదు. రేషన్‌కార్డుల మంజూరులో కూడా ఇదే తంతు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు దాటినా ఇంతవరకు వాటిపై తుది నిర్ణయం తీసుకోలేదు. మాయమాటలతో చంద్రబాబు నెట్టుకొస్తున్నారు. కోత విధించడంలో మాత్రం ముందున్నారు. దీంతో మోసపోయామని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.


వరికుంటపాడు మండలంలో ఇటీవల కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం సచివాలయంలో ఆరా తీస్తున్న జనం

- పింఛన్లకు 'చంద్ర' గ్రహణం
- లబ్ధిదారుల్లో కోత
- కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల ఊసే లేదు
- నేటికీ వెబ్‌సైట్‌లో కనిపించని నమోదు ప్రక్రియ

ఉదయగిరి: ఎన్నికలకు ముందు సవాలక్ష హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు కోసం ఎంతో మంది పేదలు ఆరునెలల నుంచి ఎదురు చూస్తున్నారు. కానీ ఇప్పటి వరకు కరుణించలేదు. అర్హులైన లబ్ధిదారులు కొత్త పింఛన్లు, కార్డులు కోసం నిత్యం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతూ నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే తమకు ఓటు వేయలేదని, తమ పార్టీ వారు కాదని పెన్షన్లలో కోత పెట్టే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. జాబితాలు తయారు చేసి గ్రామసభల ద్వారా తొలగించేందుకు సన్నాహాలు చేస్తోంది.

పింఛన్లు తగ్గాయి

కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలో 3.17 లక్షల సామాజిక పింఛన్లున్నాయి. ఆరునెలల్లో క్రమేణా తగ్గిపోయాయి. డిసెంబర్ నాటికి ఆ సంఖ్య 3,09,462కు చేరింది. మరోవైపు కొత్త పింఛన్ల కోసం ఎంతోమంది దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఈ ప్రక్రియ నిరంతరం సాగేది. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఏప్రిల్ 18న వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియను నిలిపివేశారు. ఎన్నికల సమయంలో ఎన్నో మాటలు చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మాత్రం ఏం పట్టించుకోవడం లేదు. నేటికీ నమోదు చేపట్టకపోవడంపై జనం ఆగ్రహంగా ఉన్నారు.

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు సచివాలయాల్లో దరఖాస్తు చేయించి పైసా ఖర్చు లేకుండా అనేక సేవలందించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు, నివాస పత్రాలు ఇలా ఎన్నో సేవలు ఉచితంగా అందాయి. కానీ కూటమి ప్రభుత్వం సచివాలయాలను నిర్వీర్యం చేసే ఆలోచనలో ఉంది. మళ్లీ పాత విధానం వస్తే ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి వస్తుంది.

రేషన్‌కార్డుల మంజూరులోనూ..

కొత్త రేషన్‌కార్డుల మంజూరులో కూడా ప్రభుత్వం ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదు. ఈ జాప్యంతో వివిధ పథకాల లబ్ధిదారులతోపాటు, విద్యార్థులకు కూడా తీవ్ర నష్టం జరుగుతోంది. కార్డులు లేకపోవడంతో పథకాలు అందే పరిస్థితి లేదు. విద్యార్థులకు కాలేజీల్లో కౌన్సెలింగ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రక్రియకు ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తెల్ల రేషన్‌కార్డులు ఎంతో అవసరం. ఇవి లేకపోతే సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ అధికారులు మెలిక పెడతారు.

అధికారులు ఏమంటున్నారంటే..

ఇంత వరకు కొత్త పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవని సంబంధిత అధికారులు చెబుతున్న మాట. త్వరలో వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న పింఛన్ల వెరిఫికేషన్ జరుగుతోందంటున్నారు. కొత్త రేషన్‌కార్డులపై కూడా ఎలాంటి ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడిస్తున్నారు.


ఈ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ ఇలా.. (ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


ఘటనా స్థలంలో వెంగయ్య మృతదేహం


సవరం వెంగయ్య (ఫైల్)

దుత్తలూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన 565వ జాతీయ రహదారిపై దుత్తలూరు – నర్రవాడ మార్గ మధ్యలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నర్రవాడ బీసీ కాలనీకి చెందిన సవరం వెంగయ్య (55) దుత్తలూరు – నర్రవాడ మధ్య ఉన్న ఓ పెట్రోలు బంకు వద్దకు వెళ్లాడు. తన టీవీఎస్ మోపెడ్‌కు పెట్రోలు పట్టించుకుని నర్రవాడకు బయలుదేరాడు. ఈ సమయంలో నర్రవాడ నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న కారు మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంగయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. వెంగయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి..

సీతారామపురం: మండలంలోని నారాయణప్పపేట గ్రామ సమీపాన మోటార్‌బైక్ అదుపుతప్పి మన్నెం శ్రీను అలియాస్ ఓబులేసు (56) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వరికుంటపాడుకు చెందిన మన్నెం శ్రీను బంధువు ఒకరు నారాయణప్పపేట గ్రామ సమీపాన ఉన్న తోటలో కాపలాదారుడిగా ఉన్నాడు. అతడిని కలిసేందుకు మంగళవారం రాత్రి శ్రీను బైక్‌పై నారాయణప్పపేటకు బయలుదేరాడు. తోట సమీపానికి వచ్చేసరికి రాయిని ఢీకొని బైక్ అదుపు తప్పింది. దీంతో ఓబులేసు తలకు గాయాలై మృతిచెందాడు. మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు.


ఘటనా స్థలంలో ఓబులేసు మృతదేహం

దువ్వూరు వద్ద..


మినీ లారీ డ్రైవర్ దస్తగిరి

సంగం: మండలంలోని దువ్వూరు శ్మశానం వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బుధవారం రాత్రి రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. దస్తగిరి (50) అనే డ్రైవర్ నంద్యాల నుంచి నెల్లూరుకు బుధవారం ఉదయం మినీ లారీలో కూరగాయలు తీసుకొచ్చాడు. రాత్రి తిరిగి నంద్యాలకు బయలుదేరాడు. సంగం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ దువ్వూరు వద్ద మినీ లారీని ఎదురుగా ఢీకొంది. దీంతో వాహనాలు శ్మశానం వైపు దూసుకెళ్లాయి. ఈ ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్ దస్తగిరి, అదే వాహనంలో ఉన్న శేఖర్, నరసింహ, లారీ డ్రైవర్ రమణారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్‌లో బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దస్తగిరి మృతిచెందాడు. సమాచారం అందుకున్న సంగం ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. స్థానిక యువకులు క్షతగాత్రులను వాహనాల్లో నుంచి బయటకు తీసేందుకు సహకరించారు.


గాయపడిన రమణారెడ్డి


ఘటనా స్థలంలో లారీ

మైపాడు తీరానికి పోటెత్తి..


న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం మైపాడు తీరానికి సందర్శకులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి అనేకమంది కుటుంబాలతో తరలివచ్చి సందడి చేశారు.
– ఇందుకూరుపేట

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 108	బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 218
లేయర్ (లైవ్) : 90	
బ్రాయిలర్ చికెన్ : 198	లేయర్ చికెన్ : 153

యూనియన్ బ్యాంక్ Union Bank of India (భారత ప్రభుత్వరంగ సంస్థ)
మాగుంట లేఅవుట్ బ్రాంచ్
సెంట్రల్ అవెన్యూ, మాగుంట లేఅవుట్, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు-524003
ఇ-మెయిల్: ubin0933104@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (అక్టు 54/2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ ఋణగ్రహీత/తనఖాదారు: శ్రీ తుమ్మల కిరణ్ బాబు, తండ్రి: తుమ్మల రమణయ్య, ఫ్లాట్ నెం.103, భవానీ రెసిడెన్సీ, చిల్డ్రన్స్ పార్క్ దగ్గర, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు–524002 మరియు తనఖాదారు: శ్రీ గడ్డం ప్రసాద్, తండ్రి: గడ్డం పేరయ్య, డి.నెం. 1–54, గడ్డంవారిపల్లి (పోస్ట్) గన్నేపల్లి, ఉదయగిరి మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు– 524226 వారలను డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన బకాయి రూ. 85,96,803.80 పై (అక్షరాల ఎనభై ఐదు లక్షల తొంభై ఆరు వేల ఎనిమిది వందల మూడు రూపాయల ఎనభై పైసలు మాత్రమే) చెల్లించవలసి కోరుతూ తేది.27.08.2024 న డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు 2002 రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని తేది.31.12.2024 న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా, సదరు ఆస్తితో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తితో జరిపే ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం వడ్డీ & ఖర్చులతో సహా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, వేదాయపాలెం రైల్వేస్టేషన్ రోడ్డు, వేదాయపాలెం ఏరియా, సర్వే నెం.50/2, పట్టా నెం.131, డి.నెం.26–3–331, బిల్డింగ్ ప్లింత్ ఏరియా 8595 చ.అ.లతో 42 అంకణములు లేదా 336 చ.గజాల భూమి అందు గ్రౌండ్ ఫ్లోర్ + 3 అంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్ తుమ్మల కిరణ్ బాబు, తండ్రి: టి.రామయ్య పేరున గలదు. హద్దులు: తూర్పు: ఈ ఇంటి సొంత ఉమ్మడి గోడ దూదం సంజీవయ్య స్థలం, దక్షిణం: ఈ ఇంటి సొంత ఉమ్మడి గోడ సర్వేపల్లి సుబ్బరామయ్య గారి స్థలం, పడమర: ఈ ఇంటి సొంత ఉమ్మడి గోడ పావని భారతమ్మ గారి స్థలం, ఉత్తరం: రోడ్డు.

తేది : 31.12.2024 — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : నెల్లూరు — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మాగుంట లేఅవుట్ బ్రాంచ్

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య


వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై జరిగింది. మృతుడి వయసు 50 నుంచి 55 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ కలర్ జెర్సీ, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

స్నేహితులతో సరదాగా వచ్చి..

- సముద్రంలో మునిగి యువకుడి మృతి

ఇందుకూరుపేట: మైపాడులో సముద్రంలో మునిగిపోయి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్‌నవీ (22) నెల్లూరులోని మూలాపేటలో ఉంటూ కొయ్య పనిచేస్తుంటాడు. న్యూ ఇయర్ కావడంతో సంతోషంగా గడిపేందుకు స్నేహితులు ఖాజారంతుల్లా మహ్మద్ అలీ, మరో ఇద్దరితో కలిసి బుధవారం మైపాడుకు వచ్చాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి మునిగిపోయాడు. మత్స్యకారులు అతడికి ఒడ్డుకు తీసుకొచ్చారు. చికిత్స నిమిత్తం స్నేహితులు నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా మరో నలుగురు సముద్రపు నీటిలో చిక్కుకోవడంతో స్థానిక మత్స్యకారులు, మెరైన్ పోలీసులు కాపాడారు.

లారీ ఢీకొని అడవి గుర్రం మృత్యువాత


మృతిచెందిన అడవి గుర్రం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు – ముంబై రహదారిపై పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా లారీ ఢీకొనడంతో అడవి గుర్రం మృతిచెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పాలిటెక్నిక్ కళాశాల వెనుక వైపు పొలాల నుంచి జాతీయ రహదారి పైకి వస్తున్న గుర్రాన్ని నెల్లూరు నుంచి బద్వేల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు తొలుత దానిని గేదెగా భావించారు. అనంతరం పరిశీలించి అడవి గుర్రంగా గుర్తించి నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సిబ్బందిని పంపారు. జేసీబీతో గుర్రం కళేబరాన్ని రోడ్డు పక్కకు నెట్టేశారు. ఇటీవల ఇదే ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని నక్క మృతిచెందిన విషయం తెలిసిందే. దీని గురించి అటవీ శాఖ అధికారులకు తెలిపినా ఇటువైపు రాలేదని స్థానికులు చెబుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.32
సన్నవి	రూ.25
పండ్లు	రూ.15

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR
■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629 [T-2447]

REAL ESTATE
■స్పాట్ క్యాష్‌తో కనుపర్తిపాడు, పడారుపల్లి, కొండాయపాళెం, కల్లూరుపల్లి, బి.బి.నెల్లూరు, కాకుటూరు, బి.వి.నగర్ ఏరియాలలో అన్ని లే అవుట్ల నందు ప్లాట్‌లు కొనబడును. సంప్ర: 98494 89529. [NA- 6768]

PLOT FOR SALE
■నెల్లూరు ఇస్కాన్ సిటీ "D" బ్లాక్ విశ్వసాయి స్కూల్ సమీపంలో 60అంకణము (30 అంకణముల తూర్పు ఫేసింగ్, 30 అంకణముల పడమర ఫేసింగ్) గల ప్లాట్ ఉమ్మడిగా కాని / విడివిడిగా కాని అమ్మబడును. సంప్ర: 96405 86857. [NA- 6768]

SERVICES

GOLD FINANCE
■బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నవి బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. సెల్: 98851 82772, 62813 46878. [N-1266707]

WANTED
■అపూర్వ క్లినిక్ నందు పని చేయుటకు నర్సింగ్ స్టాఫ్ మరియు ల్యాబ్ టెక్నీషియన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. కావేరి నగర్, పడారుపల్లి, నెల్లూరు. సెల్ : 78934 77911. [NA-6763]

■నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల RKT పెట్రోలు బంకులో 24గంటల డ్యూటీకి యువకులు కావలెను. డే డ్యూటీకి యువతి, యువకులు కావలెను. సంప్రదించండి : 95501 89885. [NA-6762]

■రాఘవ ఆటో ఫైనాన్స్ నెల్లూరు నందు ఆఫీస్ వర్క్ చేయుటకు యువకులు కావలెను. టూ వీలర్ తప్పనిసరి వయస్సు : 21–30 సంవత్సరాలు. సంప్రదించండి : 9154067710, 9100055963. [NA-6764]

■హెల్పర్స్–4, సప్లయర్స్–5, సూపర్‌వైజర్స్–2, కటింగ్ మాస్టర్స్–2, నార్త్ ఇండియన్ ఐటమ్స్–మాస్టర్–1 కావలెను. శ్రీ దుర్గా హోటల్, నెల్లూరు. సెల్: 93469 79323. [NA-5472]

■గూడూరులో డెంటల్ క్లినిక్ నందు పనిచేయుటకు Male / Female Persons కావలెను. సంప్రదించండి సెల్: 99639 33122. [T-789101]

■రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe.జీ+కమీషన్+2వీలర్+రూం+భో ఫ్రీ, Age : 30, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15242]

■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99434]

■KTM బైక్ షోరూం నందు పని చేయుటకు అనుభవము కలిగిన లేడీస్ & జెంట్స్ సర్వీస్ అడ్వైజర్స్ కం కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. బయోడేటాతో సంప్ర: HDFC బ్యాంక్ ఎదురు, వేదాయపాళెం, నెల్లూరు. 70135 69269. [NA-760]

■ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ HDFCలో మండలాల వారీగా డిగ్రీ విద్యార్హత కలిగి, 35 సం॥ వయస్సు పైబడిన టీం లీడర్లు, అడ్వైజర్లు కావలెను. రిటైర్డ్ Ex.బ్యాంకర్స్, హౌస్ వైఫ్స్, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, ట్యాక్స్ కన్సల్టెంట్, చిట్ ఫండ్ ఏజెంట్లు, వ్యాపారస్తులు అర్హులు. సెల్: 95028 53505. [NA-6761]

LOST
Notice is hereby given that the undersigned has lost his original certificate at Nellore of his BA and M.B.A Degree issued to him by Sri Sathya Sai Institute of Higher Learning. Whoever finds it is hereby requested to return the same to the undersigned immediately. Name of the Candidate: M. Jeevan Sekhar Reddy. Address: No. 1-14-145, Mannem vari Street, Nellore - 524001.

■ఫార్మసీ/ మందుల షాపు నందు పని చేయుటకు చేయుటకు లేడీ స్టాఫ్ కావలెను. Qualifications : D.Pharm / B.Pharm with Computer Knowledge 2 to 3 సంవత్సరాల అనుభవం. Contact: Dr. S.Andal, లక్ష్మీఫెర్టిలిటీ సెంటర్, S2 సినిమా హాలు దగ్గర,పొగతోట, నెల్లూరు. సంప్రదించండి : 9908854316, 0861-2328914. [NA-2762]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

నయా జోష్..


కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ..


పిల్లలతో సరదాగా తిరుగుతూ..

నెల్లూరు(క్రైమ్): పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త ఏడాదికి స్వాగతం చెబుతూ జిల్లా వాసులు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా చేసుకున్నారు. యువత పెద్ద సంఖ్యలో రోడ్ల పైకి చేరుకుని సందడి చేశారు. మంగళవారం అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి బాణసంచా కాల్చి సంబరాల్లో మునిగిపోయారు. శుభాకాంక్షలు చెప్పుకొంటూ ఆనందంగా గడిపారు. బుధవారం తెల్లవారుజామున మహిళలు ఇళ్ల ముంగిట నూతన సంవత్సర ఆగమనాన్ని తెలియజేస్తూ రంగవల్లులు తీర్చిదిద్దారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఇక మందుబాబులు నిషాలో మునిగి తేలారు.

పటిష్ట బందోబస్తు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం ఏడు గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు రహదారులపై గస్తీ నిర్వహించారు. 60 స్పెషల్ మొబైల్ పార్టీలతో ప్రత్యేక డ్రైవ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు. నెల్లూరు నగరంలోని వీఆర్సీ, ఆర్టీసీ, రామలింగాపురం, చిల్డ్రన్స్ పార్కు, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాలు ప్రజలు, వాహనాలతో కిక్కిరిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్ బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, శ్రీనివాసులరెడ్డి, సాంబశివరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటరెడ్డి, రామకృష్ణ, డీటీసీ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మలు బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ నెల్లూరు నగరంలో పర్యటించారు.


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు


చిల్డ్రన్స్ పార్క్ వద్ద సాయిబాబా మందిరంలో పూజలు


వీఆర్సీ సెంటర్‌లో జనం


విధుల్లో ఉన్న పోలీసులు